కథానిక:

# తపతి



అతని పేరు ఆదిత్యుడు. కాని అతనిని ప్రజలు లోకాని కొక వేగుచుక్క అంటారు. కారణం - ప్రపంచసౌభాగ్యమే అతని జీవితాశయం. అయితే అతనిలోని ఈ సుగుణం భారతీయులలో వింత కాదు. మానవసేవయే ముఖ్యాశయంగా ఎంచిన మహాను భావులు ఇంతకు ముందు అనేకమంది ఈ పుణ్యభూమిపై చరించారు, ఎప్పుడూ ఉన్నారు. కాని ఆదిత్యుని సిద్ధాంతంలో ఒక క్రొత్తదనం ఉంది. ప్రేమ, గౌరవం అనే రెండింటినీ, పెద్ద చిన్న అనే వివక్షత లేకుండా అందరపట్లనూ సమానంగా చూపేవాడు. పుణ్యాత్ముని వద్ద ప్రవర్తించిన విధాన్నే పాపాత్ముని వద్దనూ ప్రవర్తించేవాడు కాని ఈ సూత్రంలో ఎక్కడో లోపం ఉందంటారు కొందరు పెద్దలు. చీకటిని పోగొట్టే వెలుగు తృష్ణతో బాధపడే లేడికి జలాశయాన్ని చూపుతుంది. ఆ వెలుగే ఆకలిగొన్న సింహానికి లేడి ఉనికిని తెలుపుతుంది. ఈ వెలుగు ఒక విధంగా లేడికి సహాయకారి అయినా, మరో విధాన ప్రాణహానికి తోడ్పడుతున్నది. ఈ విషయంలో వెలుగుకు నిష్పక్షపాతబుద్ధి ఉందని చెప్పగలమా?

ఆ వెలుగే వేటకానికి సింహాన్ని చంపుటకు కూడ సహాయం చేస్తుందని అంటాడు ఆదిత్యుడు.

అయితే, ఈ నిష్పక్షపాతబుద్ధివలన ప్రయోజన మేమిటి? లేడి సింహంచేత చంపబడుతున్నది. సింహం వేటకానిచేత చంపబడుతున్నది. వేటకాడు కూడతన శత్రువుచేత చంపబడవచ్చును. దీని కిక అంతు ఎక్కడ?

అంతు లేనిమాట నిజమేకాని జీవిత చిత్రంలో ఇది ఒక్క అంశంమాత్రమేనని ఆదిత్యు డంటాడు. వెలుగే పాపాని కొడబడుతున్న దనలేము కదా!

ఆదిత్యుని పుత్రిక తపతి తండ్రి ఆశయాలను చక్కగా అర్థం చేసుకున్న యౌవని అందరిపట్లనూ సమానాదరణ చూపడం ఒక మహా త్యాగమని ఆమె అభిప్రాయం. అందం, యౌవనం, ప్రేమ, వివాహం, మొదలైనవి స్వలాభంకోసం స్వసౌఖ్యంకోసమే కాని, మానవసేవకు తోడ్పడేవి కావు ప్రపంచసౌభాగ్యమే జీవితానికి ఆనందాన్నిచ్చేది. ఈ సూత్రాలకు ఎదురుతిరిగి ప్రవర్తించే వ్యక్తులు ఈ ప్రపంచంలో ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే; అనే భావం ఆమెహృదయకుహరంలో ఇమిడి ఉండేది. ఇట్టి మహదాశయా లున్న తపతి ఆదిత్యునకు చేదోడు. ఆమెకు సూర్యభగవానునియందు అధిక భక్తి, కారణం ఆమెలో కల భావాలే సూర్యునిలో మూర్తీభవించి ఉన్నాయి. సూర్యుడు తన కాంతిని ఈ విశాలజగత్తులో నలుమూలలా సరళంగా విస్తరింపచేస్తాడు.

ఆదిత్యుని ఆశయాలందు నమ్మిక గలిగి, వానిని ఆచరణలో పెట్టగలిగిన వ్యక్తి మరొక డున్నాడు. అతని పేరు సంవరణుడు. సంవరణుడు మహారాజు. భోగభాగ్యాలకు కొదువ లేదు. కాని

మానవసేవ చేయదలచుకొన్న ప్రతి వ్యక్తీ ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండాలని అతని అభిప్రాయం. వివాహం నిష్పక్షపాతబుద్ధికీ, ప్రజాసేవకూ ఆటంకాలు. సర్వజనుల్నీ సమానంగా ప్రేమిస్తూ, ప్రత్యేకంగా ఒక స్త్రీని తన ప్రేమకంతకీ పాత్రురాలను చెయ్యడం విరుద్ధమనుకున్నాడు.

*   *   *   *

ఆ వేళ సంవరణుని జన్మదినం. గురువైన ఆదిత్యునకు తన గౌరవం ప్రకటించడానికి ఆయన నివాసానికి వెళ్లాడు. ఉపవాసాలతోనూ, నియమ నిష్ఠలతోనూ పెంపొందిన సంవరణుడు ఒక మహాజ్యోతివలె ప్రకాశిస్తున్నాడు. ఆదిత్యుడు సంవరణునకు తగిన గౌరవమర్యాదలు జరిపి కూర్చుండ చేశాడు. కాని ఎందుకో ఆదిత్యుని మనస్సు కొంచెం కలవరపడుతున్నది ఆనాడు. సంవరణుని ప్రవర్తనలో ఏదో లోప మున్నదని అతని అంతరాత్మ చెప్తున్నది. యౌవనంలో ఉన్న మహారాజుకు ఇంతటి కఠిన నియమాలు, నిష్ఠ అనవసరమని ఆదిత్యుని అభిప్రాయం. మహారణ్యాలలో నివసించే మునులకే తగును. కాని ప్రజలను పాలించే రాజుకు ఇది తగదు. అనుకున్నాడు ఆదిత్యుడు. సంవరణుని దీవిస్తూ "నాయనా, నా దొక చిన్న కోర్కె ఉన్నది." అన్నాడు.

"పెద్దలు తమరు. మీ కోర్కె ఏదో తెలియచేయండి గురూ"

"నీ రాజ్యపాలనలో ప్రజలంతా సుఖంగా ఉంటున్నారు. కాని, దాంపత్య జీవితం ప్రజాసేవకి ఆటంక మనే నీ అభిప్రాయం ఒక పిచ్చి నమ్మకమని నా ఉద్దేశం."

"క్షమించాలి. నా మనస్సు మరొక విధంగా ఉన్నది. స్వసౌఖ్యంకోసం తాపత్రయపడిన ట్లయితే స్వార్థమే అన్నిటినీ అణగత్రొక్కి తాను ప్రధానమై కూర్చుంటుందని నా అభిప్రాయం"

"కాదు. సంవరణా! వివాహం స్వసౌఖ్యానికే కాదు. మానవసేవకు కూడా తోడ్పడుతుంది. త్యాగమనేది మతం కాదు త్యాగబుద్ధితో సంఘసేవ చేయడం నీ ఉద్దేశం కాని నీ నియమంలో పటుత్వం లేదు. వివాహమయినతర్వాత భార్యాభర్తలిద్దరు ప్రజాసేవకు నడుము కట్టుకొనవచ్చును. చూడు—నాకు, నీకు ఏ విషయములోనూ భేదం లేదు. నేను దాంపత్యజీవితం గడుపుతున్నాను. కొడుకులు, కూతుళ్ళతో హాయిగా కాలం వెళ్ళబుచ్చుతున్నాను. నా ఆశయాల కెట్టి భంగం కలగలేదు. అయినప్పటికీ నా కుమార్తె పెండ్లివిషయంతలంపుకు వచ్చినపుడెల్ల చింత కలుగుతున్నది."

"దాని కంత చింత ఎందుకు? మీ భావం నాకు పూర్తిగా బోధపడలేదు, గురూ!"

"ఆమెను నీవు వివాహం చేసుకోవాలని నా కోర్కె."

సంవరణుడు అప్రతిభుడైనాడు. "మహాప్రభూ, తమయందు నాకు అపార గౌరవ మున్నది. మీ సిద్ధాంతాలనే నమ్మి పాటిస్తున్న నా మార్గాన్ని మీరు నిరోధించకండి. తమరు నాకు గురువులు. తమపట్ల, తమ సిద్ధాంతాలపట్ల నాకు గల విశ్వాసం అచంచలంగా ఉండాలని ఎల్లప్పుడూ నా మది కోరుతున్నది."

"నా సిద్ధాంతాలకు విరుద్ధంగా నిన్నేమీ చెయ్యమనడం లేదే!"

"కాని నే నా విధంగానే భావించవలసి వస్తున్నది. మీ పుత్రిక వివాహంలో మీకు గల ఆసక్తే మీచేత నన్నిట్లు ప్రేరేపింప చేస్తున్నది. మీ యీ కోర్కెలో స్వలాభం ప్రత్యక్షమౌతున్నది"

ఆదిత్యుడు నిరుత్తరుడైనాడు. సంవరణుడు చెప్పినదానిలో నిజము లేకపోలేదు. తన కుమార్తెకై యోగ్యుడైన వరుని వెదకుతున్న మాట వాస్తవం. అది కాక సంవరణుడే తపతికి తగిన భర్త కాగలడని ఆయన ఉద్దేశం. స్వలాభంకోసం తాను సంవరణుని నియమం మార్చుకోమని బోధించాడు. కాని ఇందులో ఏమైనా పొరబాటుందేమో ఆదిత్యుడు తరచి తరచి చూశాడు. అంతరాత్మను ప్రశ్నించాడు. కాని సమాధానం లేదు. సంవరణుడు తనతో అన్నమాటలకు కొంచెం కించపడ్డాడు. మెల్లగా ఇలా అన్నాడు. "సంవరణా! నా స్వార్థానికీ, ఈ ఉపదేశానికీ ఎటువంటి సంబంధ మున్నప్పటికీ, నే చెప్పిన దానిలో ఏమైనా లోప మున్నాదా?"

సంవరణుడు కొంత ఉద్వేగంతో ఇలా అన్నాడు. "అటువంటి అపేక్షయే మీ ఉపదేశానికి హేతువైతే, తమరు తప్పక పక్షపాతబుద్ధి ప్రకటించారనడానికి నే నెంత మాత్రమూ జంకను. మీ పుత్రిక పెండ్లి విషయమే మిమ్మల్ని ఎక్కువగా బాధిస్తున్నది కాని, అందులోని స్వార్థం మీకు కానరావడం లేదు. అది ప్రజాసేవాశయానికి విరుద్ధమని నేను నిశ్చయంగా చెప్పగలను."

"పొరబడుతున్నావు రాజా! - నా సిద్ధాంతాలనుంచి నే నెన్నడూ దూరం కాను. నే నిప్పటికీ ఆ సూత్రాలనే మనఃపూర్వకంగా విశ్వసిస్తున్నాను. నీవు నా కుమారుడవు కావు. అయినా, తపతి ఎంతో నాకు నీవుకూడా అంతే. నేను నిన్ను నా కుమారునికంటె అధికంగా గౌరవిస్తున్నాను. నా ఆందోళన, అపేక్ష తపతి వివాహంగురించి మాత్రమే కాదు. సంవరణునికి తగిన వధువును చేకూర్చడంకూడా ఇమిడివుంది. రెండువిధాలా ఈ భారం నాపైన ఉన్నది. అయితే మీ ఇద్దరి సంయోగంవలన ప్రపంచానికి ఉత్కృష్ట సేవ లభించగలదని నా విశ్వాసం. అందుకే నిన్నింతగా కోరవలసివచ్చింది. ఇందులో దోష మున్నదని నేను భావించడంలేదు"

"గురువులు—క్షమించాలి మీరు చెప్పినది నాకు మనస్కరించడం లేదు. ఇంద్రియాలను జయించాను. నిశ్చలమైన జీవితాన్ని గడపడమే నా ముఖ్యాశయం. ప్రతిఫలం లేనటువంటి ప్రజాసేవయే నేను చేయగోరేది. నేను ఇప్పటిలో వివాహం చేసుకున్నట్లయితే స్వసౌఖ్యాసక్తుడనై, ఒక స్త్రీప్రేమను ఆర్జించడంలోనే నా మనస్సంతా లగ్నమైపోవచ్చును. నా విధ్యుక్తధర్మాన్ని విస్మరించగల అవకాశ ముంది."

ఆదిత్యుడు స్తబ్ధుడైపోయాడు. మరేమీ మాటాడలేదు. సంవరణుడు తిరిగి తన రాజ్యాన్ని చేరుకున్నాడు. గురువువద్దకు వెళ్ళినందుకు అతడు క్రొత్త విషయాలు తెలుసుకొనలేదు. పైగా గురువుగారిని ఆయన సిద్ధాంతాలతోనే ఓడించాడు.

*   *   *

సంవరణుడు ఒకనాడు ఒంటరిగా అడవికి వెళ్ళాడు. ఆటవికప్రజల జీవితాన్ని పరిశీలిస్తూ, ప్రయాణిస్తూ ఉండడం సంవరణునికి ప్రీతి. మునీశ్వరులను దర్శిస్తూ వుంటాడు. తిరిగితిరిగి అతడు ఆ మహారణ్యంలో ఒక ఎత్తైన ప్రాంతం చేరాడు. ప్రకృతి అతిరమణీయంగా ఉంది. నిర్మల నీలాకాశపుటందం, అస్తమిస్తున్న సూర్యుని బంగారుకాంతులతో అరణ్యసౌందర్యం ద్విగుణీకృత మయింది. దూరాన పర్వత పంక్తి. చుట్టుప్రక్కల రకరకాల అడవి జాతి పూపొదలు. మనస్సునకెంతో ఆనందాన్ని చేకూర్చుతున్నాయి. ఒక సన్నని కాలిబాట అడవిగుండా పోయి, ఆ పర్వత పంక్తిని చేరుతున్నది. దిగువను మైదాన ముంది. కొండ చరియలలో కొన్ని ఇళ్ళు కానవస్తున్నాయి. సంవరణుడు మరలిపోవడానికి సంకల్పించుకున్న సమయంలో ఆ సన్నని కాలిబాటనే నడుస్తున్న ఒక ఛాయ

గవోక్యాక్
రాజమండ్రి

దూరాన కొనవచ్చింది. అత డక్కడే నిల బడి చూస్తున్నాడు. ఆ ఛాయ సమీపిస్తున్నది. క్రమంగా ఆమె ఛాయ దగ్గిరకు రానురాను ఒక యువ్వని అని తెలియ వచ్చింది. కొంతదూరంలోనే ఆమె ఆగి పోయింది. సంవరణుడు కొంత సేపు ఆలోచించి ఆమెను మెల్లగా సమీపించాడు. అతనికి ఆశ్చర్యం కలిగింది. ఇంతవరకూ తాను చూసి అనుభవించిన ప్రకృతిసౌందర్య మంతా కలబోసి తీర్చిదిద్దినట్లుం దామె. ఇంతవరకూ పొందిన ఆనందానుభూతిలో ఏదో లోప మున్నట్లు, ఇప్పు డాతనికి తట్టింది. ఆ యువతిని చూడగానే ఆ లోపం తీరిపోయిందని అతనికి స్ఫురించింది. ఆమెలో కల తేజము, అందము సంవరణుని ముగ్ధునిచేశాయి. ఈ విశాలజగతిలో అంద మయినవస్తువంటూ ఒకటి ఉన్నదనిఈనాటికి తెలుసుకున్నాడు అతడు. ఆమెసాక్షాత్కారంతో వింత ఛాయలు పులుముకుంటున్న ప్రకృతి ఆనందాతిరేకంతో పూపరిమళాన్ని వెదజల్లింది. సెలయేరు గలగల మంటూ చక్కని సంగీతంతో చిత్రమైన ఉపదేశాలు చేస్తున్నది.

పరస్పరావలోకనంలో ఉభయులూ కొంతసేపు తమ ఉనికిని మరచిపోయారు. తరువాత తెప్పరిల్లి ఒకరి కొకరు సెరుకపరచుకొన్నారు. ఆమె తపతి. ఆదిత్యుని పుత్రిక. ఇద్దరూ చింతాజలధిలో ఉక్కిరిబిక్కి రయారు.

సంవరణుని నిరాకరణ ఆమెకు తెలుసును. భయంతో ఆమె విచలిత అయింది.

ఆమెసౌందర్యానికి ముగ్ధుడైన సంవరణుని లజ్జ ఆవహించింది. అతడు శిరసు వంచుకున్నాడు. కొంతసేపటికి తిరిగి చూసేసరికి ఆమె అక్కడ లేదు. అప్పటికి అంధకారం ఆక్రమించింది.

ప్రపంచమంతా తలక్రిందులయినట్లు తోచిం దతనికి. తాను పాలిస్తున్న నియమాలు, నిష్ఠ అన్నీ ఎందుకు? అతడు ఓడిపోయినట్లు తనలో తా నంగీకరించాడు. అతని మనోకాశమంతా తపతిరూపసౌందర్యంతో నిండిపోయింది.

* * *

సంవరణుడు తిరిగి రాజ్యం చేరుకోలేదు. ప్రజలంతా ఆశ్చర్యపోయారు. రాజ్యం విడిచి, ప్రజాసేవ మరచి అతడు ఆ అరణ్యంలోనే నివాస మేర్పరచుకున్నాడు. సంవరణుని మనోగర్వమే అతనిని నిలువునా కూలద్రోసింది.

దేశంలో అరాచకం ప్రబలింది. రాజు లేని రాజ్యములో శాంతి లేదు. ఒకనాడు వసిష్ఠమహర్షి సంవరణునివద్దకు వచ్చాడు సంవరణుడు మనోవేదనచే కృశించిపోయాడు. అతని ముఖంలో పూర్వపు తేజస్సు లేదు. అతని విచారకారణం తెలుసుకొని వసిష్ఠుడు ఆదిత్యునికి తెలియ చేశాడు.

ప్రకృతిసౌందర్యానికి ముగ్ధులై, ఆశయాలొకటై, జీవితధర్మ మొకటై అనుష్ఠాన మొకటైన తపతీసంవరణుల దాంపత్యం లోకానికొక కొత్త వన్నె తెచ్చిపెట్టింది.

(ఒక బెంగాలీరచన ఆధారం)





పెద్ద పచ్చిమిరపకాయలను అడ్డంగా సగము ఉడుకబెట్టి కాడను కోసివేయండి తరువాత వాటిలోని గింజలను తీసివేయండి; తరువాత వేపబడిన పుల్లిపాయముక్కలు, ఉడుకబెట్టబడిన బఠాణీగింజలు మరియు కేరట్లు లేక ఉడుకబెట్టబడిన గ్రుడ్లముక్కలు, ఉడుకబెట్టబడినటువంటియు, పలుగగొట్టబడినటువంటియునైన బంగాళాదుంపలు లేక ఉడుకబెట్టబడిన మాంసపుముక్కలు, అల్లపుముక్కలు, కొత్తిమిరి, ఆవాలు, ఉప్పు మరియు నిమ్మరసమును కలువగా నేర్పడిన మిశ్రమమును వాటిలో క్రుక్కండి. సన్నని పుల్లలతో కాడను బిగువండి. ఇప్పుడు డాల్డాను పెనములో వేడిచేయండి. తరువాత ఈ పెద్ద పచ్చిమిరపకాయలను దానిమీదనుంచి అవి వండబడేదాకా వేపండి. డాల్డా ఒక శుద్ధమైన శాక క్రొవ్వుపదార్థమగుటచే అది చాలకాలం వేపకమునకు చాల మంచిది. ఇందువలన అది ఆహారమును సరిగావగుటకు ఎంతకాలము కావలెనో అంతకాలము వండనిచ్చును.

ఎదురుచూడని అతిథులకు త్వరితముగా తయారుచేయుటకు వీలైన ఆహారములు:

ఉచిత సంపాకొరకు ఇప్పుడే—లేక ఏరోజైనను వ్రాయండి!

# ది డాల్డా అడ్వైసరీ సర్వీస్

పోస్టు బాక్సు నంబరు 353, బొంబాయి 1

